క్లుప్తంగా

నేడు కాపవరంలో గడప గడపకూ..

బిక్కవోలు: కాపవరంలో శనివారం సాయంత్రం 5 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభమవుతుందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతల ప్రసాదరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకోవడమే కాకుండా ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరిస్తారన్నారు. దీనికి ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు తరలిరావాలని ఆయన కోరారు.

ప్లాస్టిక్ వాడకం తగ్గిద్దాం



పందలపాకలో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పిస్తున్న సచివాలయ సిబ్బంది

బిక్కవోలు: ప్లాస్టిక్ వాడకం తగ్గిద్దాం.. ఆరోగ్యాన్ని కాపాడుకుందాం అంటూ పందలపాక సచివాలయ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. శుక్రవారం ఆ గ్రామంలో ప్లాస్టిక్ వాడకానికి వ్యతిరేకంగా ప్రచారం చేశారు. వస్త్ర సంచుల వినియోగంతో జరిగే మేలు, ప్లాస్టిక్‌తో కలిగే అనర్థాలపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది మణికంఠ రంగారావు, సూరిశెట్టి సురేష్, వెలగల విజయలక్ష్మి, కుంద్రపు అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తుకు మార్గదర్శకాలు గ్రంథాలయాలు

రంగంపేట: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు గ్రంథాలయాలు మార్గదర్శకాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వీఎల్ఎస్ సాయివర ప్రసాద్ అన్నారు. శుక్రవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టంలో భాగంగా గ్రంథాలయాధికారి ఎస్.రామకోటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన తరగతులను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ విజ్ఞాన సముపార్జనకు పుస్తక పఠనమే ఏకైక సాధనమన్నారు. శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు తెలిపారు. అనంతరం విద్యార్థులతో యోగాసనాలు, సూర్య నమస్కారాలు చేయించారు. అనంతరం కాంపిటేటివ్ విద్యార్థి కె.దుర్గాప్రసాద్ పాల్గొని స్పోకెన్ ఇంగ్లిష్‌పై శిక్షణ ఇచ్చారు.

చురుగ్గా ఆస్పత్రి భవన నిర్మాణం

గోకవరం: స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న 50 పడకల ఆస్పత్రి భవన నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. దీనిలో భాగంగా శుక్రవారం భవనానికి శ్లాబ్ వేశారు. ఈ పనులను ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ కర్రి సూరారెడ్డి పర్యవేక్షించారు. ఈ పనులను ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు



సుద్దమెట్టను పరిశీలిస్తున్న జేసీ తేజ్ భరత్

సీతానగరం: అర్హులందరికీ నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకం కింద స్థలాలు కేటాయించడానికి క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నట్టు జాయింట్ కలెక్టర్ ఎస్. తేజ్ భరత్ అన్నారు. మండలంలోని ముగ్గళ్ల – కోరుకొండ రోడ్డులో గల కూనవరం సుద్దమెట్టను శుక్రవారం అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ సీతానగరం, కూనవరం, రఘుదేవపురం గ్రామాలకు చెందిన 1,600 మందికి ఎన్‌పీఐ కింద ఇళ్ల స్థలాలు అందించడానికి సుద్దమెట్ట వద్ద కేటాయించిన స్థలాన్ని పరిశీలించామన్నారు. ఇక్కడ కొంత ప్రాంతాన్ని ఇళ్ల స్థలాలకు అనుగుణంగా సరిచేయడం జరిగిందన్నారు. మిగిలిన కొండను ఆనుకుని పక్కనే ఇళ్ల స్థలాలు అందించడానికి రెండు ఎకరాలు భూమి కొనుగోలు చేయడమా లేదా ఈ కొండ వద్ద స్థలాలు ఇవ్వడానికి చర్యలు తీసుకోవడమా అనేది కలెక్టర్ ఆదేశాల మేరకు తదుపరి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ రాజు, జిల్లా ల్యాండ్ సర్వే అధికారి పి.లక్ష్మణరావు, మండల సర్వేయర్ రవికాంత్, సచివాలయ సర్వేయర్ వెంకటేష్, వీఆర్వో గంగరాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు సత్కారం

రంగంపేట: ఇటీవల పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఎస్టీ రాజాపురం గ్రామానికి చెందిన విద్యార్థులు నల్లమోలు శ్రీరామ్ (584), తప్పరాడ హర్షిత (575 మార్కులు)లను సత్కరించారు. ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, అనపర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు తదితరులు ఘనంగా సన్మానించారు. శ్రీరామ్‌కు రూ.10 వేలు, హర్షితకు రూ.10 వేలను ఎస్టీ రాజాపురం సర్పంచ్ అడ్డాల పద్మ సమకూర్చగా ఆ మొత్తాన్ని వారికి అందించారు. వైఎస్సార్ సీపీ నాయకులు అడ్డాల వెంకటేష్, పప్పు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- సంపత్‌నగరంలో గడప గడపకూ..



గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: నియోజకవర్గంలో గతంలో ఏ ప్రభుత్వంలోనూ జరగని విధంగా గడిచిన నాలుగేళ్లలో 30 రెట్లు అభివృద్ధి జరిగిందని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. ఇందుకు మండలంలోని సంపత్‌నగరమే ఉదాహరణ అన్నారు. శుక్రవారం ఆ గ్రామంలో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఈ గ్రామంలో రూ.17.5 లక్షలతో అభివృద్ధి జరిగితే, తమ ప్రభుత్వంలో గడిచిన నాలుగేళ్లలోనే రూ.5.50 కోట్ల మేరకు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, నాడు –నేడు పథకం ద్వారా ప్రభుత్వ బడుల అభివృద్ధి, జల జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ తాగునీరు, ఇలా అనేకం అభివృద్ధి పనులు జరిగాయన్నారు.

అర్హతే ప్రామాణికం

జక్కంపూడి రాజా మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో ప్రభుత్వం నుంచి సాయం పొందాలంటే జన్మభూమి కమిటీలను ప్రసన్నం చేసుకోవాల్సి వచ్చేదని, లేకుంటే పచ్చచొక్కా వేసుకోవాల్సి వచ్చేదన్నారు. కానీ నేడు జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అటువంటి పార్టీల రంగులు చూడకుండా, ఎవరి దయాదాక్షిణ్యాలతో పనిలేకుండా, అర్హత ఉంటే చాలు నేరుగా ఇంటికే వచ్చి సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. గత ప్రభుత్వాలకు, జగన్ ప్రభుత్వానికి ఉన్న తేడా ఏమిటో మీరే గ్రహించాలని ప్రజలకు సూచించారు. సీఎం జగన్ రాష్ట్రంలో ఒకేసారి 31.75 లక్షల మంది పేదలకు నివాస స్థలాలు పంపిణీ చేసిన సంగతిని గుర్తు చేశారు. రాజానగరం నియోజకవర్గంలోనే సుమారు 20 వేల మందికి ఇంటి స్థలాలు ఇచ్చి, ఇళ్లు కట్టుకునే ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెద వెంకన్న, వైఎస్సార్ సీపీ మండల మాజీ కన్వీనర్ మందారపు వీర్రాజు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు కోలపాటి వెంకన్న, నెడ్ క్యాప్ డైరెక్టర్ గండి నాని బాబు, సంపత్ నగరం, పుణ్యక్షేత్రం సర్పంచ్‌లు పెంటగట్ల రామకృష్ణ, ఎం. వెంకటేశ్వర్రావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు లంక అమ్మిరాజు, నాయకులు లంక ఆదినారాయణ, లంక మాచరావు, పి.వెంకటేశ్వర్రావు, కోనే మురళి, మదిరెడ్డి వెంకన్న, పేపకాయల రాంబాబు పాల్గొన్నారు.

రేపు ఆలయ వార్షికోత్సవం

రాజానగరం: గ్రామంలోని షిరిడీ సాయిబాబా మందిర 21వ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించనున్నారు. ఆరోజు వేకువజామున 5.15 గంటలు ఇచ్చే కాకడ హారతితో వేడుకలు ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు. ఉదయం 8.30 నుంచి అఖండ బిల్వార్చన ప్రారంభమవుతుంది. మధ్యాహ్నం హారతి అనంతరం అన్నసమారాధన జరుగుతుంది.

ఆరోగ్యకర జీవన శైలిని అలవర్చుకోవాలి

గోకవరం: ప్రతి ఒక్కరూ ఆరోగ్యకర జీవన శైలిని అలవర్చుకోవాలని కొత్తపల్లి వైద్యాధికారి డాక్టర్ నిఖిత అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం పర్యావరణ హిత జీవన శైలి కార్యక్రమంపై వైద్య సిబ్బంది ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈఓపీఆర్‌డీ రాజేశ్వరరావు, ఎంపీహెచ్ఈఓ వైఎస్ రాయుడు, పీహెచ్ఎన్ భారతి, హెచ్‌వీలు అరుణోనమ్మ, లక్ష్మీకాంతం పాల్గొన్నారు.

సమన్వయంతో గ్రామాల అభివృద్ధి



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీదేవి

రంగంపేట: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించాలని ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. జెడ్పీటీసీ పేపకాయల రాంబాబు మాట్లాడుతూ సీఎం జగన్ అర్హతే ప్రామాణికంగా పథకాలు అమలు చేస్తున్నారన్నారు. గ్రామాల్లో సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేస్తున్నామని అన్నారు. ఎస్టీ రాజాపురంలో భూముల రీసర్వేలో రెవెన్యూ అధికారుల తీరు బాగాలేదని సర్పంచ్ అడ్డాల పద్మ నిలదీశారు. ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం కోటా పేదలకు ప్రభుత్వం కేటాయించిందని, ఈ విషయం మండలంలో ప్రజాప్రతినిధులకు ఎందుకు చెప్పలేదని ఎంఈఓ శ్రీనివాసరావును జెడ్పీటీసీ అడిగారు. జగనన్న కాలనీల్లో విద్యుత్తు, తాగునీటి సదుపాయం కల్పించాలని అనపర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు సూచించారు. కోటపాడులో సమస్యలను మండల పరిషత్ విప్ సుంకర అప్పారావు సభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమావేశానికి పశు సంవర్ధక శాఖ, నీటి పారుదల, పౌర సరఫరాలు, హార్టికల్చర్, పోలీసు, ఎక్సైజ్, ఇరిగేషన్, ఫిషరీస్, ఆర్టీసీ, ఆర్అండ్‌బీ శాఖల అధికారులు డుమ్మా కొట్టారు. వీరందరికీ నోటీసులు జారీ చేస్తామని, కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని ఎంపీపీ శ్రీదేవి, జెడ్పీటీసీ రాంబాబు తెలిపారు. జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, వైస్ ఎంపీపీలు మట్టా శ్రీను, రాయుడు రాంబాబు, తహసీల్దార్ వాకాడ అమ్మాజీ, ఎంపీడీఓ బి.శ్రీరామరాజు, అనపర్తి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మాచిన గోవిందరాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు, చేనేత విభాగాల అధ్యక్షులు రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, పాలాటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి



చింతపల్లిలో వలంటీర్లను సత్కరిస్తున్న ఎంపీపీ తులసి, వెంకటలక్ష్మి తదితరులు



పాలమూరులో పురస్కారాలు అందజేస్తున్న జెడ్పీటీసీ గీతావరలక్ష్మి, వెంకటరెడ్డి

పెదపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన వలంటీర్ల సేవలు వెలకట్టలేనివని ఎంపీపీ కేతా తులసి అన్నారు. శుక్రవారం పుట్టకొండ, చింతపల్లి గ్రామాల్లో సర్పంచులు వల్లు వెంకటరమణ, కొల్లు లోవకుమారి అధ్యక్షతన వలంటీర్లకు వందనం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ తులసి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2024లో తిరిగి అధికారంలోకి రావాలంటే వలంటీర్లు మరింత సమర్థవంతంగా పనిచేసి ప్రజల్లో జగన్ ప్రభుత్వంపై విశ్వాసం పెంచాలన్నారు. వలంటీర్ వ్యవస్థతో కుల, మత, రాజకీయాలకు అతీతంగా పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ కర్రి హరికృష్ణ సత్యరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యుడు కొల్లు పెద్దకాపు, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ కొల్లు సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శం

బిక్కవోలు: రాష్ట్రంలో వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని సర్పంచ్ సత్యంశెట్టి వెంకటరమణ అన్నారు. శుక్రవారం కాపవరం గ్రామంలో వలంటీర్ల వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో వలంటీర్లు అందించిన సేవలు మరువలేనివన్నారు. గత ప్రభుత్వం జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలను ఇబ్బందులు పెట్టిందని అన్నారు. ప్రస్తుతం వలంటీర్లు ఎలాంటి సిఫార్సు లేకుండా ప్రజల ఇళ్లకే పథకాలు అందిస్తున్నారని అన్నారు. అనంతరం వలంటీర్లకు పురస్కారాలు అందించి సత్కరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అశోక్‌కుమార్, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ప్రచార కమిటీ చైర్మన్ రొంగల అప్పాజీ తదితరులు పాల్గొన్నారు.



కాపవరంలో పురస్కారాలు పొందిన వలంటీర్లతో వైఎస్సార్ సీపీ నాయకులు

నిస్వార్థ సేవకులు మీరే..

అనపర్తి: ప్రభుత్వ పథకాల అమలులో కీలకపాత్ర పోషిస్తున్న వలంటీర్లు నిస్వార్థ సేవకులని జెడ్పీటీసీ సత్తి గీతావరలక్ష్మి వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం పాలమూరులో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటూ వలంటీర్లు సేవలు అందిస్తున్నారని కొనియాడారు. అనంతరం పాలమూరులోని రెండు సచివాలయాల పరిధిలో సేవా రత్న పురస్కారానికి ఎంపికైన ఇద్దరిని, సేవా మిత్ర పురస్కారానికి ఎంపికైన 35 మంది వలంటీర్లను సత్కరించి ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందజేశారు. ఎంపీటీసీ సత్తి కనకారెడ్డి, ఉప సర్పంచ్ సత్తి సూరారెడ్డి, పంచాయతీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

చెట్టు కొమ్మలు తొలగిస్తుండగా యువకుడికి గాయాలు

మధురపూడి: కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలో శుక్రవారం విద్యుత్ స్తంభాలపై పడిన చెట్ల కొమ్మలను తొలగిస్తుండగా బీశెట్టి వీరబాబు తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని అంబులెన్స్‌లో ప్రైవేటు హాస్పటల్‌కు తరలించగా, అత్యవసర విభాగంలో చికిత్స పొందుతున్నాడు. అలాగే గురువారం వచ్చిన ఉరుముల కారణంగా శ్రీరంగపట్నానికి చెందిన పెంటకొట్టి సీతయ్య పొలంలో పశువులను కాస్తూ అస్వస్థతకు గురయ్యాడు. చేనుగట్టుపై పడిపోయిన అతడిని బంధువులు చికిత్స కోసం రాజమహేంద్రవరం తరలించారు. ప్రస్తుతం సీతయ్య పరిస్థితి మెరుగుపడింది. వీరిద్దరినీ శుక్రవారం వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఇన్‌చార్జి జక్కంపూడి గణేష్, పార్టీ నాయకులు మద్దాల రమణ పరామర్శించారు. చికిత్స నిమిత్తం సహాయాన్ని అందిస్తామని, ఆ కుటుంబాలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

క్యాన్సర్ నివారణకు అధునాతన చికిత్సలు

- సినీనటుడు విజయ్ ఆంటోనీ
- స్వతంత్ర ఆస్పత్రిలో మెమోగ్రఫీ యూనిట్ ప్రారంభం



జీఎస్ఎల్ క్యాన్సర్ ఆసుపత్రిలో డిజిటల్ మెమోగ్రఫీ యూనిట్‌ను ప్రారంభిస్తున్న హీరో విజయ్ ఆంటోనీ



జీఎస్ఎల్ సిమ్యులేషన్ ల్యాబ్‌లో అనాటమేజ్ టేబుల్ గురించి హీరో విజయ్ ఆంటోనీకి వివరిస్తున్న వైద్యులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): క్యాన్సర్ నివారణకు ఎన్నో అధునాతన చికిత్సలు అందుబాటులోకి వచ్చాయని సినీ హీరో, దర్శకుడు విజయ్ ఆంటోనీ అన్నారు. కంబాలచెరువు వద్ద ఉన్న జీఎస్ఎల్ స్వతంత్ర క్యాన్సర్ ఆసుపత్రిలో బ్రెస్ట్ క్యాన్సర్ రోగులకు ఉపయోగించే డిజిటల్ మెమోగ్రఫీ యూనిట్‌ను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్యాన్సర్ రోగులకు జీఎస్ఎల్ క్యాన్సర్ హాస్పిటల్ అందిస్తున్న వైద్య సేవలు అభినందనీయమన్నారు. ఆ రోగులకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు వ్యక్తిగతంగా సహాయం అందిస్తానని తెలిపారు. ఆసుపత్రిలో క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు ఆటవస్తువులను అందించారు. వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఆయనకు ఆసుపత్రి చైర్మన్ గన్ని భాస్కరరావు వివిధ విభాగాలను చూపించి వాటి గురించి వివరించారు. డాక్టర్ భాస్కరరావు, డాక్టర్ తరుణ్ చౌదరి మాట్లాడుతూ జీఎస్ఎల్ క్యాన్సర్ హాస్పిటల్ ద్వారా 25 ఏళ్లుగా ఉత్తమ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. హీరో విజయ్ ఆంటోనీ ఆయన సంస్థ ద్వారా పంపిన రోగులకు ఉచితంగా వైద్యం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త ఏరుకొండ రఘురాం పాల్గొన్నారు.

మెడికల్ సిమ్యులేషన్‌పై సినిమా తీస్తా

రాజానగరం: మెడికల్ సిమ్యులేషన్ థీమ్‌తో ఒక సినిమా తీయాలనే ఆలోచన తనకు ఎంతో కాలంగా ఉందని, ఇక్కడ ఉన్న సిమ్యులేషన్ ల్యాబ్ చూశాక ఆ ఆలోచనకు ఒక స్పష్టత వచ్చిందని బిచ్చగాడు -2 హీరో విజయ్ ఆంటోనీ అన్నారు. స్థానిక జీఎస్ఎల్ వైద్య కళాశాలను శుక్రవారం సందర్శించిన ఆయనకు అక్కడ ఉన్న సిమ్యులేషన్ ల్యాబ్ ప్రత్యేకతలను కళాశాల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, డైరెక్టర్ డాక్టర్ గోగినేని తరుణ్ వివరించారు. అవసరం అయితే ఈ ల్యాబ్ గురించి మరిన్ని వివరాలు తెలుసుకునేందుకు మరోసారి వస్తానని విజయ్ ఆంటోనీ అన్నారు. వైద్య విద్యార్థులతో కొద్దిసేపు సమావేశమయ్యారు. బిచ్చగాడు – 2లో పాటను స్వయంగా పాటడంతో పాటు విద్యార్థులతో కూడా పాడించారు. అనంతరం రాజమహేంద్రవరం వెళ్లారు. ఆయన వెంట డిస్ట్రిబ్యూటర్ మున్నా ఉన్నారు.

జగనన్న పాలవెల్లువపై అవగాహన



కరకుదురు మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ హరికృష్ణ సత్యరెడ్డి

పెదపూడి: జగనన్న పాలవెల్లువ పథకం సర్వేపై వలంటీర్లు అవగాహన పెంచుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ కర్రి హరికృష్ణ సత్యరెడ్డి అన్నారు. కరకుదురు సచివాలయంలో జగనన్న పాలవెల్లువ సర్వేపై వలంటీర్లకు అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 30 నుంచి ఇంటింటికీ తిరిగి సర్వే చేయాలన్నారు. ఈ పథకం యాప్‌ను ఏవిధంగా డౌన్‌లోడ్ చేసుకోవాలో వివరించారు. ఏ ఇంటి వద్ద ఎన్ని పాడి పశువులు ఉన్నాయో నమోదు చేసుకోవాలన్నారు. ఆ ఇంటి యజమానురాలైన మహిళను యాప్‌లో యాడ్ చేయాలన్నారు. గ్రామాల్లో పాల సరఫరా సేవా సహకార సంఘాలు ఏర్పాటు, పాల సేకరణ తదితర అంశాలు వివరించాలన్నారు. సర్పంచ్ వుంద్రు చంద్రకళ, కార్యదర్శి బి.ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి సీఎం జగన్ సాయం

ఎమ్మెల్యే రాజా చేతుల మీదుగా రూ.లక్ష అందజేత



రెజినా కుటుంబానికి రూ.లక్ష చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: చిన్నారి వైద్యం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్థిక సాయం చేశారు. ఆయన ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా రూ.లక్ష అందజేశారు. కోరుకొండ మండలం గాదరాడకు చెందిన వల్లూరి రెజినా ఇవాంజిలియన్ అనే 8 ఏళ్ల పాప 2018 నుంచి దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతోంది. ఆ గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించినప్పుడు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా దృష్టికి ఈ సమస్య వచ్చింది. ఆ పాప తల్లి బుజ్జమ్మ అంగన్‌వాడీ వర్కర్‌గా పనిచేస్తూ, కుమార్తె వైద్యం కోసం రూ.45 లక్షలు ఖర్చు చేసింది. ఇంకా మందుల కోసం రూ.వేలు అవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆర్థిక సాయం అందించాలని ఎమ్మెల్యే రాజాను కోరారు. అలాగే కొవ్వూరు పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి ఎమ్మెల్యే రాజా ఈ విషయాన్ని తీసుకెళ్లారు. స్పందించిన సీఎం జగన్ ఆర్థిక సహాయాన్ని అందజేస్తామని చెప్పారు. దానిలో భాగంగా తక్షణ సహాయంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చిన రూ.లక్ష చెక్కును జక్కంపూడి రాజా శుక్రవారం రాజమహేంద్రవరం ప్రకాశం నగర్‌లోని పార్టీ కార్యాలయంలో బాధిత కుటుంబానికి అందజేశారు. అలాగా సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.20 లక్షలు విడుదల చేయాలని కోరినట్టు తెలిపారు.

ఎంపీటీసీ సభ్యుడికి పరామర్శ

మధురపూడి: కోరుకొండ మండలం కోటి ఎంపీటీసీ సభ్యుడు గట్టి ప్రసాద్ తండ్రి త్రిమూర్తులు ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ప్రసాద్‌ను మండలంలోని ప్రజాప్రతినిధులు పరామర్శించారు. వారిలో జెడ్పీటీసీ సభ్యుడు కర్రి నాగేశ్వరరావు, ఎంపీపీ ఉల్లి వీర వెంకట సత్యసూర్యకుమారి, వైఎస్సార్ సీపీ మండల మాజీ కన్వీనర్ ఉల్లి బుజ్జిబాబు, ఆ పార్టీ నాయకులు బొరుసు బద్రి, ఉల్లి గణ, జ్యోతుల లక్ష్మీనారాయణ, సర్పంచులు, ఎంపీటీసీలు ఉన్నారు.

ఎమ్మెల్యే రాజాకు వినతి

రాజానగరం: విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తి ఆధారంగా ఏర్పడిన ఖాళీలను భర్తీ చేసేలా మెగా స్పెషల్ టీచర్ రిక్రూట్‌మెంట్‌కి డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని నిరుద్యోగ ప్రత్యేక ఉపాధ్యాయ వేదిక ప్రభుత్వాన్ని కోరింది. సంపత్‌నగరంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఉన్న స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజాను శుక్రవారం కలుసుకున్న వేదిక జిల్లా సభ్యులు ధర్మరాజు, మురళీ, కుమారి, లక్ష్మి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు.

పేకాడుతున్న నలుగురి అరెస్టు

సీతానగరం: కాటవరంలో పేకాటాడుతున్న నలుగురిని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ సత్యనారాయణ అదుపులోకి తీసుకుని సీతానగరం పోలీస్ స్టేషన్‌కు అప్పగించి కేసు నమోదు చేశారు. కాటవరం ఇటుక బట్టీల సమీపంలో గురువారం పేకాటాడుతుండగా ఎస్ఈబీ సీఐ సత్యనారాయణ తన సిబ్బందితో దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ 12,130, నాలుగు సెల్‌ఫోన్లు, రెండు మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు.

సీసీ డ్రైనేజీ ప్రారంభం

గోకవరం: స్థానిక సంజీవయ్యనగర్‌లోని మొదటి వీధిలో రూ.5 లక్షలతో నిర్మించిన సీసీ డ్రైనేజీని స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు శుక్రవారం ప్రారంభించారు. ఎంపీటీసీ తోలేటి రమ్యశ్రీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర వీరబాబు, వరసాల ప్రసాద్, కర్రి సూరారెడ్డి, ఈఓ టంకాల శ్రీనివాస్‌రావులు కొబ్బరికాయలు కొట్టి డ్రైనేజీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు పులపర్తి బుజ్జి, వార్డు సభ్యులు తుమ్మల శివాజీ, బివి చంద్రం నాయకులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

కడియం: మండలంలోని వీరవరంలో దివంగత ఇనుమర్తి వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం వారి కుమారులు ప్రభాత్, సతీష్ శుక్రవారం మజ్జిగ, పుచ్చకాయ జ్యూస్‌ను సుమారు రెండువేల మందికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముద్రగడ జెమి ఆదిమూలం సాయిబాబా, ముద్రగడ సుధా, గంధం వీరబాబు పాల్గొన్నారు.

ఆరోపణలు నిరూపిస్తే పదవికి రాజీనామా చేస్తా

కాపవరం సర్పంచ్ వెంకటరమణ



సమావేశంలో మాట్లాడుతున్న సత్యంశెట్టి వెంకటరమణ

అనపర్తి: కాపవరం పరిధిలో వెదుళ్ల చెరువు పూడికతీత పనుల్లో అక్రమ మట్టి దందా జరుగుతోందంటూ మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చేసిన ఆరోపణలు రుజువు చేస్తే తన సర్పంచ్ పదవికి రాజీనామా చేస్తానని సత్యంశెట్టి వెంకటరమణ సవాల్ విసిరారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాపవరం సర్పంచ్ వెంకటరమణ మాట్లాడారు. గ్రామానికి చెందిన కొంతమంది రైతులు వర్షాకాలంలో తమ పొలాలు ముంపునకు గురవుతున్నాయంటూ వారి సమస్యను పంచాయతీ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. దీంతో వెదుళ్ల చెరువు పూడికతీతతో వచ్చే మట్టితో ముంపునకు గురవుతున్న పొలాలు మెరక చేసుకునేందుకు గాను పంచాయతీ తీర్మానం చేసి సంబంధిత కాపీతో ఇరిగేషన్ శాఖ అధికారులకు దరఖాస్తు చేశామన్నారు. దీనిపై రైతులు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని కలిసిన సందర్భంలో చెరువు మట్టి ఒక్క ట్రాక్టర్ బయటకు వెళ్లినా ఉపేక్షించేది లేదని హెచ్చరించినట్లు చెప్పారు. రైతులు అంగీకరించడంతో ఎమ్మెల్యే సిఫార్సు లేఖను ఇచ్చారని, దీనికి అనుగుణంగా ఇరిగేషన్ అధికారులు చెరువు పూడికతీతకు సంబంధించి రైతు కొట్టు చక్రరావు పేరుతో అనుమతులు మంజూరు చేశారని సర్పంచ్ వివరించారు. ఇందులో అక్రమాలు చోటుచేసుకున్నాయని, ఈ వ్యవహారంలో ఎమ్మెల్యే దంపతులతో పాటు, రంగంపేట మండల ఇన్‌చార్జ్ నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డికి సంబంధం ఉందంటూ మాజీ ఎమ్మెల్యే చేస్తున్న ఆరోపణలను ఆయన ఖండించారు. గత టీడీపీ హయాంలో నీరు–చెట్టు పథకంలో వెదుళ్ల చెరువులో నిబంధనలకు విరుద్ధంగా మట్టి తవ్వకాలు జరిపి ముగ్గురు గ్రామస్తులు చెరువులోపడి మరణించడానికి మాజీ ఎమ్మెల్యే కారణమయ్యారన్నారు. మట్టి దందా ఆరోపణలు చేసిన మాజీ ఎమ్మెల్యే నిజనిర్ధారణ కమిటీతో కాపవరం వస్తానని చేసిన సవాల్‌ను తాను స్వాగతిస్తున్నానని, అక్కడ మట్టి దందా జరిగినట్లు నిరూపిస్తే తన పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించారు. రైతులు కొట్టు చక్రరావు, నల్లమిల్లి రామచంద్రారెడ్డి, ఉప సర్పంచ్ పోశిన గోపాలకృష్ణ, ఎస్సీ సెల్ నాయకులు కర్రి గంగరాజు, గృహ సారథి, మలకా రవి తదితరులు పాల్గొన్నారు.

గాలీవాన బీభత్సం



కోటి గ్రామంలో పిడుగు పడి కాలిపోతున్న కొబ్బరి చెట్టు

మధురపూడి: కోరుకొండ మండలంలో శుక్రవారం గాలీవాన బీభత్సం సృష్టించింది. జోరుగా కురుసిన వర్షానికి వాహన చోదకులు ఇబ్బంది పడ్డారు. కాగా.. గురువారం ఈదురు గాలులతో కూడిన వర్షానికి కోటి గ్రామంలోని అడపా వెంకన్నబాబుకు చెందిన కొబ్బరి చెట్టుపై పిడుగు పడింది. దీంతో చెట్టు పూర్తిగా కాలిపోయింది. కోటి – శ్రీరంగపట్నం, శ్రీరంగపట్నం – రాఘవపురం, శ్రీరంగపట్నం – కోరుకొండ రోడ్లపై చెట్లు పడిపోయాయి. శ్రీరంగపట్నం, కోటి తదితర గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు వెంటపాటి దుర్గారావు, మద్దాల పెద్ద అమ్మాజీ, వైఎస్సార్ సీపీ నాయకులు మద్దాల రమణ ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది, కార్మికులు వాటిని తొలగించారు.